క్లుప్తంగా

20న న్యూ రామాలయంలో చండీ హోమం


జ్ఞాన సరస్వతి అమ్మవారు

నల్లకుంట: మూలా నక్ష త్రాన్ని పురస్కరించుని శుక్రవారం న్యూనల్లకుంటలోని శ్రీ సీతా రామాంజనేయ సరస్వతి ఆలయంలో(న్యూ రామాలయం) జ్ఞాన సరస్వతి అమ్మవారికి విశేష అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె. జయంతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో అర్చక స్వాముల మంత్రోచ్ఛారణల నడుమ 'చండీ హోమము, పూర్ణాహుతి' ఉంటుందన్నారు. హోమం, పూర్ణాహుతిలో పాల్గొనాలనుకునే భక్తులు ఆలయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

20న జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం మహాసభ

చిక్కడపల్లి: తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం 6వ రాష్ట్ర మహాసభ ఈనెల 20న చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించనున్నట్లు సంఘం సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు శాంగటి అయోధ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మంత్రులు సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, టీఎన్‌జీఓ అధ్యక్షుడు రాజేందర్‌లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని జిల్లా గ్రంథాలయాల ఉద్యోగులు, పెన్షన్లు, పార్ట్‌టైమ్ వర్కర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రేపు సంగీత విభావరి

ప్రేమ ఆర్ట్స్ అసోసియేషన్ 42వ వార్షికోత్సవం, శృతిలయ మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్ 12వ వార్షికోత్సవం సందర్భంగా సంగీత నృత్య విభావరి ఈ నెల 20న సాయంత్రం త్యాగరాయ గానసభలో నిర్వహిస్తున్నట్లు సంస్థల ప్రతినిధులు సుధాకర్‌రావు, నేతాజీ తలగడదీవి, రాధికా రామకృష్ణ గడగండ్ల ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్వాంసులు, కళాకారులు గౌరవ ఆత్మీయ సత్కారం ఉంటుందన్నారు. తెలంగాణ సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, తెలుగు యూనివర్సిటీ పూర్వ వీసీ ఎస్‌వి సత్యనారాయణ అతిథులుగా పాల్గొంటారన్నారు.

బీఆర్‌ఎస్ సభ విజయవంతం పట్ల హర్షం

కాచిగూడ: ఖమ్మంలో బుధవారం నిర్వహించిన భారత రాష్ట్ర సమితి మొదటి సభ విజయవంతం కావడం పట్ల పార్టీ కాచిగూడ డివిజన్ ప్రధానకార్యదర్శి కె.సదానంద్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఖమ్మం వెళ్లినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రజల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనంగా ఈ సభ నిలుస్తుందని, ప్రజల నుంచి లభించిన అనూహ్య స్పందన పార్టీ నేతలు, కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. కార్యక్రమంలో దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బబ్లూ సింగ్, ఎస్.మహేష్ కుమార్, పి.శేషు, రాజేష్, ఆంటోని, శ్రీకాంత్ యాదవ్, ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని ఇద్దరు వృద్ధుల మృతి

కాచిగూడ: రెండు వేర్వేరు చోట్ల గుర్తుతెలియని ఇద్దరు వృద్ధుల మృతదేహాలను కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు కథనం మేరకు కాచిగూడలోని త్రివేణి లాడ్జీ వద్ద గుర్తుతెలియని వృద్ధుడు (65), బర్కత్‌పుర ఫీఎఫ్ కార్యాలయం వద్ద మరొకరు (60) మృతి చెందినట్లు సమాచారం అందడంతో పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

బాలోత్సవానికి ప్రోత్సాహం అందిస్తాం

హిమాయత్‌నగర్: ఈ ఏడాది బాలోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తమవంతు ప్రోత్సాహం అందిస్తామని కోవిద సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ జి.అనూహ్యారెడ్డి తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని ఎస్‌వీకేలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించే ఉత్సవాల్లో అతిథిగా పాల్గొనాలని నిర్వాహకులు ఆమెను బుధవారం కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనూహ్యారెడ్డి మాట్లాడుతూ..పిల్లలకు నచ్చేలా, వారు మెచ్చేలా బాలోత్సవం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఉత్సవాల్లో పిల్లలకు ఉపయోగపడే, వారికి జీవితాంతం గుర్తుండిపోయే కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. తమ ఫౌండేషన్ నుంచి ఈ కార్యక్రమానికి పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తామని అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎన్.సోమయ్య, ఉపాధ్యక్షులు జి.బుచ్చిరెడ్డి, చినుకు పీఎన్ మూర్తిలకు అనూహ్యారెడ్డి తెలిపారు.


న్యూ నల్లకుంట రామాలయం సమీపంలో చెట్ల కొమ్మలు


తిలక్‌నగర్ గాంధీ బొమ్మ పక్కలేన్‌లో డ్రైనేజీ వ్యర్థాలు


న్యూరామాలయం ఎదురుగా సిమెంట్ వ్యర్థాలు

ఎక్కడి చెత్త అక్కడే..

- న్యూ నల్లకుంటలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం
- వీధుల్లోనే డ్రైనేజీ, చెట్ల కొమ్మలు, సిమెంట్ వ్యర్థాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

నల్లకుంట: జీహెచ్‌ఎంసీలో పారిశుద్ధ్య విభాగం అధికారుల పర్యవేక్షణ లోపంతో నల్లకుంట డివిజన్‌లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డివిజన్ పరిధిలోని పలు వీధుల్లో ఎక్కడ చూసినా పేరుకుపోయిన చెత్తాచెదారంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. చెత్త కుప్పల కారణంగా దోమలు వృద్ధి చెంది కంటి మీద కునుకు లేకుండా పోతుందని ప్రజలు వాపోతున్నారు.

న్యూ నల్లకుంటలోని వివిధ బస్తీలు, కాలనీల వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, డ్రైనేజీ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. తిలక్ నగర్ గాంధీ బొమ్మ పక్క లేన్‌లో కొద్ది రోజుల క్రితం వాటర్ వర్క్స్ సిబ్బంది డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లోని వ్యర్థాలను తొలగించి వాటిని రోడ్డు మధ్యలోనే కుప్పలుగా పోసి అక్కడే వదిలేశారు. వ్యర్థాలను తొలగించాలని శానిటేషన్ సిబ్బందిని పలు మార్లు కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక న్యూరామాలయం ఎదురుగా రోడ్డు మధ్యలో సిమెంట్ వ్యర్థాలను కుప్పగా పోసి వదిలేశారు. రామాలయం సమీపంలోని శ్రీ రామ విద్యా సమితి పాఠశాల వద్ద కొద్ది రోజుల క్రితం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. అయితే వాటిని అక్కడి నుంచి తొలగించకుండా రోడ్డు పక్కన కుప్పగా పోసి వదిలేశారు. దీంతో వీధి కుక్కలు, పశువులు అక్కడికి చేరి మలమూత్ర విసర్జన చేస్తున్నాయని, దీంతో దుర్వాసన వస్తుండటమేగాక ఈగలు, దోమలు వృద్ధి చెందుతూ కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పైగా పాఠశాల పక్కనే చెత్తా చెదారం పేరుపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా వీధుల్లో అపరిశుభ్రత నెలకొన్నప్పటికీ అటు జీహెచ్‌ఎంసీలోని పారిశుద్ధ్య విభాగం అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా శానిటరీ విభాగం అధికారులు స్పందించి వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో మందీ మార్బలంతో పోటాపోటీగా నిత్యం కాలనీలు, బస్తీలలో పర్యటించే ప్రజా ప్రతినిధులు ఇప్పుడు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీ వీరభద్ర స్వామి కల్యాణోత్సవానికి ప్రభుత్వ సహకారం


వేడుకలకు మంత్రి సత్యవతి రాథోడ్‌ను ఆహ్వానిస్తున్న శ్రీ వీరభద్ర స్వామి సేవా సమితి ప్రతినిధులు

కాచిగూడ: మహబూబాబాద్ జిల్లా, కురవి గ్రామంలో వెలసిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలను శ్రీ వీరభద్ర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 22న ఆదివారం కాచిగూడ, మున్నూరుకాపు భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, ప్రధానకార్యదర్శి కాసుల వినోద్ తెలిపారు. వేడుకలకు హాజరు కావాలని కోరుతూ బుధవారం రాష్ట్ర గిరిజన, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను ఆహ్వానించారు. భక్తుల కొంగు బంగారమై, కోరిన కోర్కెలు తీరుస్తున్న కురవి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలను మొదటిసారి హైదరాబాద్‌లో నిర్వహించనుండటం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. కురవికి రాలేని భక్తులు కాచిగూడలో జరుగనున్న స్వామి వారి కళ్యాణ వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. భక్తులే ఈ వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వేడుకలకు ప్రభుత్వ పరంగా సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత కన్నె రమేష్ యాదవ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో షాబాద్ కరుణ, హరిబాబు, విజయ్ పటేల్, మించు ఆనంద్, ఆది నాగేష్, కాసుల మల్లికార్జున్, కొండూరు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ పోర్టర్‌లో నమోదు చేసుకోవాలి

- 26 నుంచి భవన నిర్మాణ కార్మికులకు మాస్టర్ హెల్త్ చెకప్
- రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ రంగ సంక్షేమ మండలి
- కార్యదర్శి డాక్టర్ గంగాధర్


డాక్టర్ ఈ.గంగాధర్

చిక్కడపల్లి: అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ-శ్రమ్ పోర్టర్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ రంగ సంక్షేమ మండలి కార్యదర్శి డాక్టర్ ఈ.గంగాధర్ అన్నారు. బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకు 40 లక్షలమంది కార్మికుల పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో దాదాపు కోటి మంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నట్లు గుర్తించామని, మిగిలినవారందరూ కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 16 నుంచి 59 సంవత్సరాల లోపు గల ప్రతి కార్మికుడు ఈ-శ్రమ్ పథకంలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆదాయపు పన్ను పరిధిలోకి రానివారు. పీఎఫ్, ఈఎస్‌ఐ లేని అసంఘటిత కార్మికులందరూ ఆపథకానికి అర్హులన్నారు. పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందుతారన్నారు. ప్రమాద మరణ బీమా, శాశ్వత అంగ వైకల్యం బీమా కింద రూ.2 లక్షలు అందించడం జరుగుతుందన్నారు.

26 నుంచి మాస్టర్ హెల్త్ చెకప్...

ఈ నెల 26 నుంచి భవన నిర్మాణ కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మాస్టర్ హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు పనిచేసే చోటే వైద్య బృందాలు వారికి అన్ని రకాల పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని, వారికి బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలతో పాటు పూర్తి బాడీ చెకప్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షల్లో కార్మికులకు రోగ నిర్ధారణ జరిగితే వారికి మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

7వ వేతన సంఘం సిఫార్సులను అమలు చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్లు

కవాడిగూడ: ఏడవ వేతన సంఘం సిఫార్సుల మేరకు 1-1-2017 నుంచి పెన్షన్ రివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా బీఎస్‌ఎన్‌ఎల్, ఆలిండియా రీజినల్ బీఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, పీఅండ్‌టీ ఏఎఫ్‌ఎస్ ఆర్‌ఓఎల ఆలిండియా యూనియన్ పిలుపు మేరకు బుధవారం కవాడిగూడలోని టెలిఫోన్ ఎక్చేంజ్ ఆవరణలోని కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ కార్యాలయం ఎదుట వందలాది మంది పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. పెన్షనర్ల సంఘాల పిలుపు మేరకు రెండోరోజు ధర్నా కార్యక్రమాన్ని నిరర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సర్కిల్ అధ్యక్షుడు ఎం. గోప రాజు, సర్కిల్‌కార్యదర్శి జి. ఉపేందర్, సీక్యూహెచ్ కార్యనిర్వాహక కార్యదర్శి ఏవీ సుధాకర్ రావు మాట్లాడుతూ... 7 వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం పెన్షన్ రివిజన్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఫిట్‌మెంట్‌ను ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కే. జయరామ్, కే దక్షిణ మూర్తి, ఎఎస్ జనార్దన్, ఎస్ కోటేశ్వర్‌రావు, పి. వెంకటేశ్వర్లు, ఎస్ నర్సింగరావు, ఎం. మధు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొమురవెల్లి మల్లన్న రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత కన్నె రమేష్ యాదవ్

కాచిగూడ: కొమురవెల్లి మల్లన్న స్వామి రథోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం కాచిగూడ డివిజన్ మోతీ మార్కెట్ నుంచి రాంకోఠి షాలిమార్ ఫంక్షన్ హాల్ వరకు స్వామి వారి ఊరేగింపు జరిగింది. ఈ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు కన్నె రమేష్ యాదవ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శైలేందర్ యాదవ్, ఉపేందర్ యాదవ్, మనోజ్ యాదవ్, బాల ప్రసాద్, ఆర్.సంతోష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్‌భారత్' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


దరఖాస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

కవాడిగూడ: నిరుపేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పేరుతో ప్రత్యేక పథకం తీసుకువచ్చిందని కవాడిగూడ కార్పొరేటర్ గోడ్చల రచనశ్రీ అన్నారు. కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ బండానగర్ కమ్యూనిటి హాల్‌లో బుధవారం ఆయుష్మాన్ భారత్ పథకం కింద పేర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ జి. రచనశ్రీ మాట్లాడుతూ నిరుపేదలకు ఆరోగ్య సమస్యల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభించిందన్నారు. సామాన్య, మధ్య తరగతి, నిరుపేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెల్లరేషన్ కార్డు ఆధార్ కార్డు తీసుకువస్తే వారి పేర్లను నమోదు చేసి కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీతో పాటు మరో 37 రకాల వ్యాధులకు అయ్యే ఖర్చులను కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. పేర్ల నమోదు కార్యక్రమం మరో రెండు రోజుల పాటు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగుతుందన్నారు. డివిజన్ పరిధిలోని పేద ప్రజలందరూ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రమోద్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్, ఓబీసీ మోర్చా కవాడిగూడ అధ్యక్షుడు చిత్రకుమార్‌గౌడ్, యువమోర్చా అధ్యక్షుడు దిలీప్ యాదవ్, హరీష్‌గౌడ్, మహిళా నాయకులు పుష్ప, మంజుల, అంగన్‌వాడీ టీచర్ పుష్ప, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'కంటి వెలుగు'


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి: కంటివెలుగు కార్యక్రమంలో ప్రజలు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అధికారులకు సూచించారు. డివిజన్‌లోని కమ్యూనిటీహాల్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు కార్యక్రమం ఏర్పాట్లు బుధవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచితంగా కళ్లద్దాలు, మందులు, అవసరం ఉన్నవారికి ఆపరేషన్ చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య సిబ్బంది ఫిర్యాదు మేరకు జవహర్‌నగర కమ్యూనిటీహాల్‌ను చేయించారు. తదుపరి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ పద్మజ, యుపీహెచ్‌ఎస్ డాక్టర్ అవంతి, కంటి వైద్యులు జాక్టర్ మనోజ్, సిస్టర్ కృప, వర్కర్లు గుర్నా, స్వప్న, బీజేపీ నాయకులు ఎ.వినయ్‌కుమార్, ఆకుల సురేందర్, నవీన్‌కుమార్, సాయికుమార్, ఆనంద్‌రావు, సాయితరుణ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

దళిత, బహుజన రాజ్యస్థాపనకు పోరాటం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వడ్లమూరి కృష్ణస్వరూప్ తదితరులు

కవాడిగూడ: తెలంగాణలో దొరల దోపిడీ రాజ్యాన్ని కూల్చి దళిత బహుజన సమతా రాజ్య స్థాపనకు ఐక్యంగా ఉద్యమించాలని దళిత బహుజనపార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. జనవరి 27 నుంచి మే 1 వరకు దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించే డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ సందేశ్ యాత్రలు రాజ్యాధికార సాధన చైతన్య సభలను విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు పార్టీ రూపొందించిన కరపత్రాలను బుధవారం లిబర్టీ చౌరస్తాలోని హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు విగ్రహం వద్ద వడ్లమూరి కృష్ణ స్వరూప్ పార్టీ నేతలతో కలిసి కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో దోపిడీ, మనువాద పార్టీలకు ఓటు వేయవద్దని దళిత బహుజనపార్టీ అభ్యర్థులకు ఓటు వేసి అంబేడ్కర్ వాదులను చట్టసభలకు పంపిస్తేనే నిమ్నజాతులకు న్యాయం, రక్షణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బీరం సతీష్‌కుమార్, డిబిఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇటికాల గణేష్, పార్టీ గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు, నాయకులు అర్షలరాజు, భాస్కర్‌రావు, పాండు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి


త్రిపుర రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ పాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహాజన సోషలిస్టు పార్టీ నేతలు

కాచిగూడ: ఎస్సీవర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ నేతలు, ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు త్రిపుర రాష్ట్ర ఓబీసీ, హోం శాఖ మంత్రి రాంప్రసాద్ పాల్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం నగరానికి వచ్చిన ఆయనను బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. నగరానికి వచ్చిన ఆయనకు పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మహాజన సోషలిస్టు పార్టీ నేతలు, ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు మంత్రిని కలిసి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతకై చొరవ తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఒప్పించాలని కోరారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో 28 ఏళ్లుగా చేస్తున్న పోరాటానికి బీజేపీ మద్దతు ఇస్తూ వస్తుందని, ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా బీజేపీ మేనిఫెస్టోలో పెట్టిందని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జీ రామారపు శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎమ్మెస్పీ నేతలు ఎడెల్లి యాదయ్య మాదిగ, బడుగుల బాలక్రిష్ణ, గజల రాజశేఖర్, బీరు యామిని మాదిగ, రశ్మిత, రమేష్, లడ్డా, బీజేపీ నేతలు ఎ.సూర్యప్రకాష్ సింగ్, ఎడెల్లి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం తరలిన గులాబీ శ్రేణులు


ముఠా జైసింహ నాయకత్వంలో ఖమ్మం బయల్దేరి వెళ్తున్న టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు


అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో..

ముషీరాబాద్: ఖమ్మం పట్టణంలో బీఆర్‌ఎస్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారీ బహిరంగ సభకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి గులాబీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ నాయకత్వంలో ఒకరోజు ముందుగానే పలువురు ఖమ్మం పట్టణానికి చేరుకున్నారు. బుధవారం ముఠా జైసింహ నాయకత్వంలో వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు బహిరంగ సభకు తరలివెళ్లారు. ముఠా గోపాల్ నాయకత్వంలో ఖమ్మం పట్టణంలో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. తరలి వెళ్లిన వారిలో కొండపల్లి మాధవ్, శ్యామ్‌సుందర్, రాకేష్, శ్రీనివాస్‌గుప్తా, శివముదిరాజ్, శ్రీధర్‌రెడ్డి, వల్లాల శ్రీనివాస్, బి. శ్రీనివాస్‌రెడ్డి, రవియాదవ్, మహ్మద్ ఖదీర్ తదితరులు ఉన్నారు.

చరిత్ర పురుషుడు ఎన్టీఆర్

జస్టిస్ చంద్రకుమార్

చిక్కడపల్లి: నందమూరి తారకరామారావు చరిత్ర పురుషులని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభ ప్రధాన వేదికలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీభారతి మ్యూజిక్ అకాడమీ సంగీతసాహిత్య కళావికాస వేదిక ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ శతజయంతి సందర్భంగా శ్రీ భారతి ఎన్‌టీఆర్ జయంతిని పురస్కరించుకుని కవి డాక్టర్ ఎస్.కె.రాముకు, కళాచైతన్య భారతి బిరుదుతో వ్యాఖ్యాత్రి ఆశాలతను భారతి బిరుదుతో నటుడు సుమన్‌ను విశ్వ నట చైతన్య భారతి బిరుదుతో సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ చంద్రకుమార్ అవార్డు గ్రహీతలను అభినందించారు. నంగునూరి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రొతూరి రంగారావు, మెడిది వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. చింతలపాటి సురేష్, రాజేష్ కుమార్, అమని, ఇందునయన పాడిన పాటలు అలరించాయి.


ఎస్.కె.రాము, ఆశాలత, నటుడు సుమన్‌తో జస్టిస్ చంద్రకుమార్

నేడు పీహెచ్‌డీ ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ఫలితాలు నేడు (19న) విడుదల చేయనున్నట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి బుధవారం తెలిపారు. గత నెల 1, 2, 3 తేదీలలో 47 సబ్జెక్టులకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలకు 6656 మంది హాజరయ్యారని నేడు సాయంత్రం 4 గంటలకు వీసీ ప్రొ.రవీందర్ తన కార్యాలయంలోని ఈసీ హాల్లో ఫలితాలను విడుదల చేస్తారన్నారు. ర్యాంక్ కార్డులను ప్రత్యేకంగా జారీ చేయబోమని ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

రైలు నుంచి జారిపడి వెండర్ మృతి

సికింద్రాబాద్: వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి రైల్వే కాంట్రాక్ట్ వెండర్ మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన బి.శివశంకర్ (20) ఉపాధి కోసం నగరానికి వచ్చి రైలులో క్యాంటీన్ కాంట్రాక్ట్ వెండర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైలులో విధులు నిర్వహిస్తున్న శివశంకర్ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

మతి స్థితిమితంలేని బాలుడి అదృశ్యం

- ప్రత్యేక బృందాల గాలింపు
- మూడు గంటల్లో తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత


కార్తికేయ

చిక్కడపల్లి: మతి స్థితిమితంలేని బాలుడు అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిన మూడుగంటల్లోనే చిక్కడపల్లి పోలీసులు బాలుడి ఆచూకీ కనుగొని అతడిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్‌హెచ్‌వో ఎన్ సంజయ్‌కుమార్ బుధవారం వివరాలు వెల్లడించారు. బాగ్‌లింగంపల్లి శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన హేమచందర్ దంపతుల కుమారుడు పి.కార్తికేయ(14) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. హిమాయత్‌నగర్‌లోని ఓ స్కూల్‌లో చదువుతున్న అతను బుధవారం ఉదయం బ్యాగ్ తీసుకుని స్కూల్‌కు బయలుదేరాడు. అయితే తండ్రి కుమారుడిని స్కూల్‌కు తీసుకెళ్లలేదని తెలియడంతో అతడి తల్లి కుమారుడి కోసం పరిసర ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో మధ్యాహ్నం చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు డీఐ నరేష్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాలుడి కోసం గాలింపు చేపట్టారు. సీసీ పుటేజీల ఆధారంగా అతను బర్కపుర చౌరస్తాలోని క్రౌన్‌కేఫ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడికి చేరుకుని బాలుడిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ముకర్రంజాకు నివాళి

హిమాయత్‌నగర్: నిజాం నవాబు ముకర్రంజా బహదూర్ భౌతిక కాయానికి 'ఫోరం ఫర్ ఏ బెటర్' చైర్మన్ మణికొండ వేదకుమార్ ఘన నివాళులర్పించారు. బుధవారం చౌమాలా ప్యాలస్‌లో ఉన్న భౌతికకాయాన్ని చరిత్రకారుడు ఆనంద్‌రాజ్ వర్మతో కలిసి సందర్శించారు. అనంతరం ముకర్రంజా బహదూర్ కుటుంబ సభ్యుల్ని కలిసి వారికి సంతాపాన్ని వ్యక్తం చేశారు.